


అవార్డులందుకున్న చేబ్రోలు రైతులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెం దిన చల్లా సత్తిరాజు, ఒరుగంటి రాంబాబు జిల్లా ఉత్తమ పట్టు రైతులుగా అవార్డులు అందుకున్నారు. గురువారం సత్యసాయి జిల్లా మడకశిరలో జరిగిన 'నా పట్టు - నా అభిమానం' పట్టు పంటలలో ఆవిష్కరించిన సాంకేతిక విషయాలపై జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సెరికల్చర్ అడిషనల్ డైరెక్టర్ సి.అరుణకుమారి, హిందూపురం ఎంపి పార్థసారథి, మడకశిర ఎంఎల్ఎ రాజు, కలెక్టర్ ఎస్.చేతన్ చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకున్నారు.


బహుమతిని అందుకుంటున్న రైతు

పాడి రైతుకు ఏదీ అండ.?

- అమలు కాని 'పశు బీమా'
- పథకాన్ని పక్కన పెట్టిన సర్కార్
- ప్రీమియంపై స్పష్టత కరువు
- ఆందోళనలో పశు పోషకులు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమను పూర్తిగా విస్మరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాడి రైతుల సమస్యలను కనీసంగానైనా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే పశు బీమా పథకంపై తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. బీమా పథకానికి ప్రభుత్వం మంగళం పాడిందా అనే అనుమానాలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. గత వైసిపి ప్రభుత్వం బీమా పథకంలో మార్పులు తీసుకొచ్చి ప్రీమియంలో 15 శాతం భారాన్ని రైతులపై మోపింది. ఈ ప్రభుత్వం ఏకంగా ఏడాదిన్నర కాలంగా పథకాన్నే పట్టించుకోవడం మానేసింది. రైతుల నుంచి ప్రీమియం చెల్లించుకునే విషయంపై ఇంకా ఆదేశాలు ఇవ్వలేదు. బడ్జెట్ కేటాయించకపోవడమే ఇందుకు కారణంగా అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ప్రతీ మూడేళ్లకు ఒకసారి ప్రీమియం చెల్లించుకుని పశు వులకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తారు.

కాకినాడ జిల్లాలో 76,502 ఆవులు, 2,82,274 గేదెలు, 1,01,870 గొర్రెలు, 1,41,229 మేకలు ఉన్నాయి. 92,48,636 కోళ్లు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,22,550 మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి జరిగింది. 62,481 మెట్రిక్ టన్నుల మాంసం ఉత్పత్తి, 30,553 లక్షల గుడ్ల ఉత్పత్తి జరుగుతోంది. ప్రభుత్వ తీరుతో గతంలో పోల్చుకుంటే జిల్లాలో పశుసంపద తగ్గి పోయిందని రైతులు అభిప్రాయపడుతున్నారు. పాడి పరిశ్రమను ప్రోత్స హించే విధంగా ప్రభుత్వం గతంలో అమలు చేసిన వివిధ పథ కాలు ఒక్కొక్కటిలో ప్రభుత్వం కోత విధిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

బీమాను కల్పించాలి



పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాం. వర్షాకాలం కావడంతో ఏదైనా ప్రమాదం జరిగి పశువులు మృతి చెందితే మా పరిస్థితి ఏమిటి. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి పశువులను పోషిస్తున్నాం. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలి.

-బర్ల చంటిబాబు, బలరామపురం, రైతులపూడి మండలం

బీమా ఇవ్వని బీమా

పశు బీమా రైతులకు ఇస్తోంది బీమా అంటూ ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. కానీ ఆచరణలో పథకం అమలుపై తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపుతోంది. గతంలో పాడి రైతులు ఒక రూపాయి కూడా చెల్లించకుండానే ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించేది. గత వైసిపి ప్రభుత్వం కొంత ప్రీమియం భారాన్ని రైతులపై వేసింది. 85 శాతం రాయితీతో పశు బీమాను అమలు చేసింది. 85 శాతం ప్రీమియం ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో చెల్లిస్తున్నాయి. మిగిలిన 15 శాతం రైతులు చెల్లించాల్సి ఉంది. బీమా వర్తింపును 5 నుంచి 10 పశువులకు, అలానే 50 గొర్రెలు/మేకల నుంచి 100 గొర్రెలు/ మేకలకు పెంచడం ద్వారా పశుపోషకులకు మనో ధైర్యం కల్పించడం జరిగిందని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పింది. కానీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ దీనిని అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తుంది. దీంతో పశువుల పెంపకందార్లు కష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలం కావడంతో ఊహించని విపత్తులతో పశువులు మృత్యువాత పడితే ఆ సమయంలో పశు బీమా కొంత ఊరటనిస్తుంది. అయితే అలాంటి బీమాపై రాష్ట్ర ప్రభుత్వం నేటికీ స్పష్టతనివ్వకపోవడంతో పాడి రైతులు నష్టపోయే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, విద్యుత్ షాక్‌లు సంభవిస్తే పశువులు మృతి చెందే అవకాశాలు ఎక్కువగా ఉం టాయి. అలాగే వ్యాధుల కాలం కావడంతో గేదెలు, ఆవులు, జీవా లకు గాలికుంటు, థైలేరియా, హెచ్.ఎస్ బి క్యూ తదితర వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పశు బీమా పథకం అమలులో లేకపోవడంతో ఇబ్బందులు ఉంటాయి. ఆవులు, గేదెలు, గొర్రెలు, ఇతర పెంపుడు జీవాలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదని, బడ్జెట్ కేటాయింపులు ఉంటేనే పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. ఆదేశాలు వచ్చిన వెంటనే బీమా సౌకర్యాన్ని కల్పిస్తామని వారు చెబుతున్నారు. తక్షణమే బీమా పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నరు.


రంగరాయ మెడికల్ కాలేజీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ప్రయివేటీకరణ చేయొద్దంటూ ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయొద్దంటూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. గురువారం నగరంలోని భానుగుడి, రంగరాయ మెడికల్ కళాశాల వద్ద ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయొద్దని నినాదాలు చేస్తూ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీకాంత్, ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య విద్యను ప్రయివేటీకరణ చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను తీసుకుని వస్తే...నాడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. నేడు అధికారంలోకి వచ్చాక 100 శాతం సీట్లను 10 కాలేజీలను ప్రయివేటీకరణ చేయాలని నిర్ణయం చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ కాలేజీల్ని ప్రయివేటుపరం చేయడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందని అన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యను ప్రయివేటు విద్యాసంస్థల్లో చదవాలంటే కోట్లాది రూపాయలు వెచ్చించాల్సి వస్తాదని, ఫీజులు కట్టలేక వారు వైద్య విద్యకు దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ విధానాల వల్ల ప్రభుత్వ కాలేజీలో సెల్ఫ్ ఫైనాన్స్ గ్రూపులో కాలేజీల్లో సీట్లు వచ్చిన విద్యార్థులు ఏడాదికి సుమారు రూ.13.20 లక్షలు చెల్లించాల్సి వస్తుందన్నారు. అదే ప్రభుత్వ కళాశాలలో అయితే కేవలం సుమారు రూ.15 వేలు మాత్రమే ఫీజు ఉంటుందన్నారు. ఇటువంటి ప్రభుత్వ వైద్య కళాశాలలను నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. పేద ప్రజలకు భవిష్యత్తులో వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎ.వాసుదేవ్, కె.సిద్దు, సిహెచ్. లోవరాజు, సత్యం, ఆదర్శ, సంతోష్, అక్షర, లౌక్యశ్రీ, లేక వర్షిని, ఐశ్వర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

రజక వృత్తిదారుల సంఘం మండల నూతన కమిటీ ఎన్నికైంది. గురువారం ముప్పారపు అచ్చియమ్మ కల్యాణ మండపంలో సంఘ మండల మహాసభ వానపల్లి గంగాధర అధ్యక్షతన జరిగింది. ఈ సభలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు మున్నూరు భాస్కరయ్య, జిల్లా నాయకులు కోనేటి రాజు పాల్గొని మాట్లాడారు. మండల అధ్యక్షులుగా పేట అప్పారావు, కార్యదర్శిగా వానపల్లి గంగాధర్, కార్యవర్గ సభ్యులుగా లోవలక్ష్మి, ముంగళ్ళ సుబ్బారావు, పాకలపాటి లావరాజు, చోడవరపు బుజ్జిలతో పాటు మరికొందరు ఎన్నికయ్యారు. ఈ మహాసభలో రైతు సంఘం నాయకులు అప్పారెడ్డి, సిఐటియు నాయకులు కెవివి.సత్యనారాయణ, కల్లుగీత నాయకులు కాళ్ళ నాగేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు చీకట్ల సౌహార్ద సందేశాలు ఇచ్చారు. పలు తీర్మాణాలను మహాసభ ఆమోదించింది.


మహాసభలో మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

ప్రగతిలో వర్క్ షాప్ నిర్వహణ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్ఇ విభాగం ఆధ్వర్యంలో 'ఐఒటి ఇంటిగ్రేటెడ్ విత్ ఎంఎల్' అనే అంశంపై 3 రోజుల వర్క్ షాప్ నిర్వహించామని కళాశాల ఛైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఇటువంటి నూతన టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రిసోర్స్‌పర్సన్స్ ఎన్.చైతన్య రాణీ, ఎం.మహేష్, జి.పవన్ ఐఒటి ఇంటిగ్రేటేడ్ విత్ ఎంఎల్ ఆధునికంగా, సమర్థవంతంగా ఎఐ ప్రాజెక్టులను డెవలప్ చేయడానికి ఉపయోగపడ తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవి.హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌కు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

సుందరయ్య భవన్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

సిపిఎం అగ్రనేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గురు వారం స్థానిక సుంద రయ్య భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు దుంపల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని కె.సత్తిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి కాకినాడ వాసి కావడం గర్వకారణమన్నారు. ఏచూరి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన మార్క్సిస్టు నేత అని కొనియాడారు. ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం కవి సమ్మేళనం, గురువారం రక్తదాన శిబిరం, శు క్రవారం బాలాజీ చెరువు సెంటర్‌లో కళాప్రదర్శనలు ఏర్పాటు చేసామన్నారు. సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఉద్యమాలు చేస్తామని అన్నారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నాయకులు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, సిహెచ్.సతీష్, సిహెచ్. రాజ్‌కుమార్, సిహెచ్.రమణి, ఆర్.వెంకటలక్ష్మి, జి.భూలక్ష్మి, పి.సూర్య, సి.వెంకట్రావు, రామకష్ణ తదితరులు రక్తదానం చేశారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కామరాజు బృందం రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజశేఖర్, కె.వీరబాబు, యు.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో రక్తదానం చేస్తున్న సిపిఎం నాయకులు

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం

ప్రజాశక్తి - పిఠాపురం, గండేపల్లి, తాళ్లరేవు

విధి నిర్వహణలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని లేకుంటే ఆందోళన చేపడతామని ఎపి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. గురువారం పిఠాపురం ఎంపిడిఒ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ జెవిఎస్.రామకృష్ణ, ఎఒ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులుగా రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కానీ ఉద్యోగులు ప్రతీసారి ఇంటింటికి తిరిగి విధులు నిర్వహించడం వలన క్షేత్రస్థాయిలో తీవ్ర అవమానాలకు గురిఅవ్వడమే కాక ఆత్మగౌరవానికి భంగం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక రాష్ట్ర వైస్ ఛైర్మన్ షేక్ మహబూబ్ బాషా, ఉద్యోగులు గంగాధర్, సునంద్, కాశీ, ప్రభాకర్, ఉదయ, ఈశ్వర్, పద్మ, దుర్గాభవాని, పరమేశ్వరీ, బుజ్జి, భవాని, సాయి, ప్రభు, ప్రసాద్, రాజశేఖర్, వరలక్ష్మి పాల్గొన్నారు. అలాగే గండేపల్లి ఎంపిడిఒ చంద్రరావుకు మండల సచివాలయ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బి.జాన్‌క్రిస్టోఫర్ మాట్లాడుతూ సమయపాలన లేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, సిహెచ్.రాజేష్, పి.సతీష్, కంటిపూడి రఘు, పి.గోపి, ఎండీ.కరీం, తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎంపిడిఒ సత్యనారాయణకు సచివాలయ ఉద్యోగులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగ సంఘం నాయకులు ఎం.గోపి, ఎ.సుధీర్, ఆదిలక్ష్మి, స్వరూప మాట్లాడారు. 15రోజుల్లోగా తమ సమస్యలు పరిష్కారించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


పిఠాపురంలో వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

దంత ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతీ ఒక్కరూ దంత ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ జి.అన్వేష్ అన్నారు. గురువారం స్థానిక మహారాణి కళాశాలలో కెఎల్ఆర్ లెనోరా దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కళాశాల విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయి అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్ననాటి నుంచి దంతాల పట్ల శ్రద్ధ వహిస్తే దంతాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. దంత సమస్య వచ్చినప్పుడు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ జాస్తి రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అనేక సదస్సులు, శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.శివరా, డాక్టర్ జిబి.నైనాదత్త, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అన్వేష్

'ముదునూరి' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం గ్రామంలో ఒక నిరుపేద కుటుంబానికి వైసిపి నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో దళితపేటకు చెందిన గంపల కుమారి కడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో గురువారం ఆమె నివాసానికి వచ్చిన ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బాధితరాలి కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దడాల సతీష్, కొండపల్లి అప్పారావు, బొబ్బిలి వెంకన్నబాబు, జువ్వల దొరబాబు, తాడి పుత్తరావు, పోకనాడి వెంకటేశ్వరరావు, కేశినేడి సురేష్, నల్లా వెంకటేష్ పాల్గొన్నారు.


బాధిరాలికి నగదును అందిస్తున్న ముదునూరి

గిరిజన గ్రామాలకు ఆర్‌టిసి సేవలు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పలు గిరిజన గ్రామాలకు ఎట్టకేలకు ఆర్‌టిసి సేవలు ప్రారంభం అయ్యాయని ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. శంఖవరం మండలంలోని వేళంగి, పెదమల్లాపురం తదితర గ్రామాలకు నిలిచిపోయిన ఆర్‌టిసి బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని ఎంపి ఆదేశాలతో ఆర్‌టిసి అధికారులు గురువారం నూతన సర్వీసును ప్రారంభించారని తెలిపారు. గత ప్రభుత్వంలో పెద మల్లాపురం వెళ్లే రహదారి అత్యంత అధ్వానంగా మారడంతో బస్సు సర్వీసును నిలిపివేశారని, కూటమి ప్రభుత్వంలో కొత్త రోడ్డును నిర్మించి ఆ సర్వీసును పూనరుద్ధరించినట్లు తెలిపారు. గురువారం కాకినాడ నుంచి కత్తిపూడి మీదుగా వేళంగి వరకు రోజుకు రెండు దఫాలు ఆర్‌టిసి సర్వీసులు ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారని ఎంపి కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది.

'వేతన బకాయిలు చెల్లించాలి'

ప్రజాశక్తి - కాజులూరు

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కోలంక గ్రామంలో కె.సత్యనారాయణ అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసి మూడు నెలలు అవుతున్న ఇప్పటివరకు బకాయి వేతనాలు ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమని, చట్టప్రకారం 15 రోజుల్లో డబ్బులు ఇవ్వాలని ఉన్న చట్టాన్ని అమలు చేయడంలో, ఉపాధి శ్రామికులను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వేతనాలు ఇవ్వకపోతే కూలీలు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పంపన ప్రసాద్, చింతపల్లి భరీల్లమ్మ, గుత్తుల రాముడు, కోడగాల అన్నవరం, దొంగ సుబ్బారావు, కాదా కొండ, తదితరులు పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న సంఘం నాయకుడు ఈశ్వరరావు

ముద్రగడను కలిసిన పంతం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మాజీ మంత్రి వైసిపి పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభంను గురువారం కిర్లంపూడిలో రాజమహేం ద్రవరం నగరానికి చెందిన పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పంతం కొండలరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ముద్రగడ కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా కొండలరావు గుర్తు చేశారు. గిరిబాబును రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి సత్యనారాయణ, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ పడాల శ్రీను, పాల్గొన్నారు.


ముద్రగడతో పంతం కొండలరావు

కార్టూ'నిజం'



నైపుణ్యంతో పని చేస్తే తగిన గుర్తింపు

ప్రజాశక్తి - సామర్లకోట

ఉద్యోగులు క్రమశిక్షణ, నైపుణ్యాలతో పనిచేస్తే తగిన గుర్తింపు వస్తుందని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ కమిషనర్ రేవు ముత్యాలరాజు అన్నారు. గురువారం స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శిం చారు. అనంతరం శిక్షణ పొందు తున్న ఎంపిడిఒలతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులను నిర్వర్తించే ప్రతి దశలోనూ సవాళ్లు ఎదురవుతాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని పరిష్కరించగలిగితేనే ఉద్యోగ జీవితం సంతృప్తికరంగా ఉంటుందన్నారు. శిక్షణ ద్వారా పరిపాలన నియమావళిపై అవగాహన పెంపొందించి మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. అనంతరం విస్తరణ శిక్షణా కేంద్రం నిర్వాహణ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన శిక్షణ కేంద్రం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిఎస్‌డబ్ల్యూఎస్, వైద్య, విద్య, ఇంజనీరింగ్ తదితర విభాగాల శిక్షణ ఈ కేంద్రంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. అలాగే నిరుపయోగంగా ఉన్న పాత, శిథిల భవనాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇటిసి ప్రిన్సిపల్ కెఎన్‌వి.ప్రసాదరావు, జడ్‌పి సిఇఒ వివిఎస్ లక్ష్మణరావు, డిపిఒ రవికుమార్, ఇటిసి వైస్ ప్రిన్సిపల్ జి.రమణ, జెఎన్‌టియుకె ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్, డిడిఒలు శ్రీనివాస్, విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


ఎంపిడిఒల సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాలరాజు


5కె మారథాన్ రెడ్ రన్‌ను ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ నరసింహనాయక్

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

ఎయిడ్స్ నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ జె నరసింహనాయక్ సూచించారు. గురువారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్‌తో కలిసి ఆయన స్థానిక వివేకానంద పార్కు గేటు నుంచి రామారావు పేట వరకు సాగిన 5కె మారథాన్ రెడ్ రన్‌కు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, పెన్షన్ సదుపాయం కల్పించిందని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఎయిడ్స్ వ్యాధి సోకిందని కుంగి పోకూడదన్నారు. ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని, ఎయిడ్స్ బాధితులకు ధైర్యం నింపాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమలో డా.విల్సన్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అరుణ, ఎన్‌సిడి. ప్రోగ్రాం ఆఫీసర్, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ పి.బాలాజీ, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ ఎ.బుజ్జిబాబు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై దాడికి ఖండన

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని బి.కొత్తూరు గ్రామంలో వినాయక నిమజ్జనం ఊరేగింపులో దళితులపై జరిగిన దాడిని మానవ హక్కుల వేదిక సభ్యులు ఖండించారు. దాడిలో గాయపడిన బాధితుడు ఎం.అంజిబాబును గురువారం వేదిక సభ్యులు పరామర్శించారు. జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిసిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో చట్టబద్ధ పాలనను అపహాస్యం చేస్తూ దళితుల మీద వరుస దాడులు జరగడం శోచనీయమన్నారు. ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణగా చూపించే ప్రయత్నం మాని దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పరామర్శలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రవి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహమ్మద్ ఇక్బాల్, మేకా గౌరవ్ పాల్గొన్నారు.

నేపాల్‌లో తెలుగు ప్రజలకు అండగా లోకేష్

ప్రజాశక్తి - కాకినాడ

నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలకు అండగా మంత్రి నారా లోకేష్ నిలిచారని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు వారికి అపద అనగానే తక్షణమే సహాయక చర్యలు చేపట్టిన లోకేష్ స్పందన ప్రశంసనీయమన్నారు. బాధితులతో స్వయంగా మాట్లాడి ధైర్యం చెప్పడం, లోకేషన్ కోఆర్డినేట్లతో మ్యాప్ సిద్ధం చేయించడం, ఢిల్లీలోని ఎపి భవనంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయించడం, చిక్కుకున్న వారికి ఆహారం, నీరు, వసతి సదుపాయాలు కల్పించడం వంటి ప్రతి చర్యలో లోకేష్ ప్రజల పట్ల ఉన్న తపన ప్రతిఫలించిందని తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఆరు కేసుల నమోదు

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి-కత్తిపూడి రహదారిలో గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఆరు కేసులు నమోదు చేసినట్లు కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. అధిక లోడు, రికార్డులు సక్రమంగా లేని వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

6 ఇసుక లారీల సీజ్

ప్రజాశక్తి - గోపాలపురం

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు లారీలను జిల్లా మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. గురువారం తెల్లవారుజామున గోపాలపురంలో మైనింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గూటాల, తాళ్లపూడి, పట్టిసీమ ఇసుక ర్యాంపుల నుండి అధిక లోడు, బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదిత్య సతీష్‌రెడ్డి

జాతీయ మేనేజ్‌మెంట్ సదస్సుకు సతీష్‌రెడ్డి

గండేపల్లి - ప్రజాశక్తి

మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం ప్రో-చాన్సలర్ డాక్టర్ సతీష్‌రెడ్డి అఖిల భారత మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎఐఎంఎ) 52వ జాతీయ సదస్సులో పాల్గొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ సదస్సులో పారిశ్రామిక, విద్యా రంగానికి చెందిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ రెడ్డి నేతృత్వం, ఆవిష్కరణ, భవిష్యత్‌లో ఉన్నత విద్యాసంస్థల పాత్రపై అభిప్రాయాలను పంచుకున్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే లైసెన్స్‌ల రద్దు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎరువులు, పురుగుల మందులు అమ్మే వ్యాపారస్తులు నిబంధనలు పాటిం చాలని, వాటిని అతిక్రమిస్తే షాపులు లైసెన్స్ లు రద్దు చేస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. గురువారం రామచంద్రపు రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో గడ్డి మందు తీసుకుని చనిపోయేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో మంత్రి సుభాష్ ఆందోళన వ్యక్తం చేశారు. పురుగుమందుల చట్టం 1968 ప్రకారం పురుగుల మందు, గడ్డి మందులు కొనుగోలు చేసే రైతులకు బిల్లులు ఇవ్వాలని, అలాగే రైతుల పాసు పుస్తకాలు చూసి మాత్రమే అమ్మకాలు జరపాలని ఆదేశించారు. ఇప్పటికే అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. పాసు బుక్కులు, బిల్లులు లేకుండా అమ్మకాలు చేసిన షాపులపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని మంత్రి సుభాష్ అన్నారు. వ్యాపారులు వ్యవసాయ శాఖ అధికారులతో సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్య క్రమంలో కూటమి పార్టీ నాయకులు బొండా వెంకన్న, కొత్తపల్లి ముర్రర్జీ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ఫిల్లింగ్ పనులను ఆలయ డిప్యూటీ కమి షనర్ నల్లం సూర్య చక్రధరరావు గురువారం పరిశీలించారు. యాత్రికులు వాహనాలను నిలుపుకునేందుకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టంగా పనులు చేపట్టాలని సిబ్బందికి ఆయన సూచించారు. యాత్రికుల తాకిడి ఎక్కువ కావడంతో లొల్ల శివారు శ్రీరామ నగర్ సమీపంలో నూతనంగా ఆరు ఎకరాలు పై పడే పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా లొల్ల రజక పేట నుంచి ఏటిగట్టు మీదుగా వాహనాలను ఈ పార్కింగ్లోకి మళ్లిస్తున్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి గురువారం పశ్చిమగోదావరి జిల్లా, పెను మంత్ర గ్రామానికి చెందిన నరాలశెట్టి గిరిబాబు, మాధవి దంపతులు, వారి కుటుం బ సభ్యులు రూ.50,116, కాజులూరు మండలం ఆర్యవటంగ్రామానికి చెందిన సనపాల వెంకటేశ్వరరావు, శ్యామల దంప తులు, వారి కుటుంబ సభ్యులు రూ.51,116 విరాళాన్ని ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరావుకు అందజేశారు.

రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మడికి రావి చెట్టు దగ్గర నుంచి చిలకలపాడు శివారు వరకు రూ.1.14 కోట్లతో నాబార్డు నిధులతో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు గురువారం ఎంపిడిఒ ఎ.రాజు స్థానిక కూట మి నాయ కులతో కలిసి విస్తరణ పనులను ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి శర వేగంగా జరుగుతుందని అన్నారు.. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు దొండపాటి సుబ్బరాజు, ఈదర రమేష్, పంపన అంజిబాబు, అడబాల శ్రీనివాస్, కొత్తపల్లి కష్ణ, పాలూరి బుల్లబ్బాయ, పెనుమాక నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - మామిడికుదురు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా సివిల్ సప్లై అధి కారి అడపా ఉదయ భాస్కర్ విద్యార్థులకు సూచించారు. పౌష్టిక విలువలతో కూడిన పాఠ శాల భోజనాన్ని ప్రతీ విద్యార్థి తినాలని అన్నారు. పాశర్లపూడి హైస్కూల్ నందు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం అమలు తీరును గురువారం ఆయన పరిశీలించారు. ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నైతిక విలువలు పెంపొంది ంచుకో వాల న్నారు. జనరల్ నాలెడ్జి, వర్తమాన విషయాలు, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. వినియోగదారులు హక్కుల గురించి వివరించి వినియోగదారులు క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు.

మొరాయిస్తున్న ఆర్‌టిసి బస్సులు

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - జగ్గంపేట

'ఆర్‌టిసిలో ప్రయాణం..సురక్షితం సుఖవంతం' అనేది ఆర్‌టిసి యాజమాన్యం నినాదం. కానీ ప్రస్తుతం సుఖవంతం అనే మాట ఎక్కడ కనిపించడంలేదు. ఆర్‌టిసి బస్సు ఎక్కితే గమ్యస్థానాలకు ఎప్పుడు చేరతారో తెలియని పరిస్థితి నేడు నెలకొంది.


మరో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిన నాటి నుంచి ఆర్‌టిసిలో మహిళల సంఖ్య పెరిగింది. ఏ బస్సుల్లో చూసిన మహిళలే కిక్కిరిసి ఉంటున్నారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులను పెంచకపోవడంతో ఉన్న బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. అయితే పాత బస్సులలోనే ఉచిత బస్సు సేవలు అందించడంతో తరచూ మొరాయిస్తున్నాయి. ప్రయాణ సమయాల్లో బస్సులు మరమ్మతులకు గురికావడంతో సుఖవంతమైన ప్రయాణం సాగడం లేదనే అభిప్రాయాలను మహిళలు వ్యక్తం చేస్తున్నారు. సమయానికి గమ్యానికి చేరలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల టైర్లు ఫంక్చర్ కావడం, గేర్లు పడకపోవడం తదితర సమస్యలు ఉత్పన్నం కావడంతో ప్రయాణికులు మార్గ మధ్యలోనే నిలిచి



జగ్గంపేట-గోకవరం మధ్య నిలిచిపోయిన ఆర్‌టిసి బస్సు

ఉండిపోవాల్సి వస్తుంది. జగ్గంపేట జంక్షన్ కావడంతో గోకవరం, రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలేశ్వరం, తుని డిపోలకు చెందిన బస్సులు ఈ మార్గం ద్వారానే వెళ్తుంటాయి. ఇలా వెళ్ళే బస్సులు తరచూ మరమ్మతులకు గురై మధ్యలో ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి ప్రయాణికులు తమ తమ గమ్యస్థానాలకు త్వరితగతిన చేరేలా కండీషన్‌లో ఉన్న బస్సులను అందుబాటులోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'చలో విజయవాడను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి - పెద్దాపురం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న నిర్వహిస్తున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురు వారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో వడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన కూటమి పార్టీల నేతలు అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలో తొక్కుతున్నారని అన్నారు. కనీసం భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులతో దీనిపై మాట్లాడేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఇప్పటికే కార్మిక శాఖ మంత్రి, డిప్యూటీ సిఎంలను కలిశామని, ముఖ్యమంత్రికి అనేకసార్లు విన్నవించా మన్నారు. ప్రభుత్వం నుంచి ఏమాత్రం స్పందన రాకపోవడంతో ఈ నెల 15న చలో విజయవాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగంలోని అన్ని విభాగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ, పెయింటింగ్ వర్కర్స్ యూని యన్ నాయకులు గూనూరు వెంకటరమణ, తైనాల శ్రీను, వామిశెట్టి స్వామి, సత్యనారాయణ, ధర్మరాజు, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎల్‌ఎ పంతం పుట్టినరోజు

ప్రజాశక్తి - కరప


మొక్కలు నాటుతున్న జనసేన కార్యకర్తలు

కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ పంతం నానాజీ పుట్టినరోజు వేడుకను జనసేన నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్.భావారం గ్రామంలో శాఖ వంశీ, బుంగ బాబి ఆధ్వర్యంలో జరిగిన పుట్టినరోజు వేడుకలో జనసేన నాయకులు భోగిరెడ్డి కొండబాబు కేక్ కట్ చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో ఎఎంసి ఛైర్మన్ ముద్రగడ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకలో పారిశుధ్య కార్మికులకు పండ్లు అందజేశారు. రెడ్ క్రాస్ వసతి గృహంలో అనాధ పిల్లలకు భోజన ఏర్పాట్లు చేశారు. పెనుగుదురు గ్రామ కమిటీ అధ్యక్షులు గంటా నానిబాబు ఆధ్వర్యంలో నడకుదురులో జనవాళి స్వచ్ఛంద సేవా సంస్థ వృద్ధుల అనాధ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. పెనుగుదురులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు భోగిరెడ్డి కొండబాబు, బండారు మురళి, ముద్రగడ రమేష్, భోగిరెడ్డి గంగాధర్, నక్క బ్రహ్మాజీ, చెక్కపల్లి మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా మండలి వార్షికోత్సవం

ప్రజాశక్తి - తాళ్లరేవు


సభలో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

మండలం తాళ్లరేవుకు చెందిన బీమాబాయి మహిళా మండలి 30వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండలి డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన అధ్యక్షతన జరిగిన సభలో కోరంగి ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల మహిళల అభివృద్ధి కోసం గత 30 ఏళ్లగా బీమాబాయి మహిళా మండలి చేస్తున్న సేవలు ఆదర్శనీయమని అన్నారు. డైరెక్టర్ నందివర్ధన మాట్లాడు తూ కొద్ది మంది మహిళలతో ప్రారం భమైన మహిళా మండలి, ఒక స్వచ్ఛంద సంస్థగా ఎదిగి ప్రస్తుతం రెండు జిల్లాల్లోని తొమ్మిది మండలాల్లో అనేక మంది ప్రజలకు సేవలు అంది స్తుందని అన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ఎపిఎం శైలేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కనకరత్నం, విఒఎల సంఘం అధ్యక్షురాలు రత్నకుమారి, నాయకులు వాసంశెట్టి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన వన పంటల్లో అధిక దిగుబడి

ప్రజాశక్తి - జగ్గంపేట


శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న హెచ్ఓ శ్రీవల్లి

తేనే తీగల పెంపకం ద్వారా జీడిమామిడి, మామిడి పంటల్లో దిగుబడి పెరుగు తుందని కలవచర్ల కెవికె శాస్త్రవేత్త ఎన్‌వి.రఘు నందన్ అన్నారు. గురువారం మండలంలోని రాజపూడిలో మామిడి, జీడి మామిడి తోటల సమగ్ర యాజమాన్య పద్ధతులు, తేనెటీగల పెంపకంపై రైతులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. పండ్ల తోటల్లో తేనెటీగల బాక్సులను ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. పండ్లు దిగుబడి పెరగడంతో పాటు తేనె ద్వారా ఆదాయం వస్తుందన్నారు. అలాగే తెగుళ్ల నియంత్రణకు అనుసరించాల్సిన పద్ధతు లను వివరించారు. ఉద్యానవన శాఖ అధికారిని శ్రీవల్లి మాట్లాడుతూ తేనె టీగల బాక్సు ఏర్పాటుకు రూ. 60 వేలు ఖర్చు అవుతుందని, ఎస్‌టి రైతులకు ప్రభుత్వం ద్వారా 40 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల తేనెటీగల పెంపకం దారుడు రామరాజు, సర్పంచ్ బుసాల విష్ణు మూర్తి, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాడిమొగ పిహెచ్‌సి హెల్త్ విజిటర్ లక్ష్మి అన్నారు. గురువారం కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెంలో సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.సింధు, ఎఎన్ఎం అచ్యుతాకుమారి, హెల్త్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఆశా వర్కర్లు దేవి, దుర్గ పాల్గొన్నారు.

తెలుగువారిని రప్పించడంలో లోకేష్ భేష్

ప్రజాశక్తి - జగ్గంపేట

నేపాల్ మారణోమంలో చిక్కుకున్న 215 మంది తెలుగువారిని మంత్రి నారా లోకేష్ స్వస్థలాలకు తీసుకువస్తున్నారని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ తెలిపారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు వారు ఆపదలో ఉన్నారని తెలియగానే ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా లోకేష్ స్పందించి అనంతపురం పర్యటనను రద్దు చేసుకున్నారన్నారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ సెంటర్ వార్ రూమ్‌ను కమాండ్ కంట్రోల్ గదిగా మార్చి సహాయక చర్యలను వేగవంతం చేశారన్నారు. ప్రత్యేక విమానం ఏర్పాటుచేసి తెలుగువారిని ఇండియా తీసుకువస్తున్న రాజ్యసభ సభ్యులు సాన సతీష్‌బాబును అభినందించారు. ఈ సమావేశంలో టిడిపి నా య ు క ు ల ు పాల్గొన్నారు.

గుంతలమయం..!

-ప్రమాదాల బారిన ప్రయాణికులు
-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు-కిర్లంపూడి రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డులో వెళ్లాలంటే ప్రయాణికులు భయాందోళనకు గురౌతున్నారు. రాత్రిపూడి ప్రయాణంలో పలువురు ద్విచక్రవాహనదారులు ప్రమాదాల భారిన పడి గాయాలపాలవుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం రహదారుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఐదేళ్ల పాలనలో రహదారులపై తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదు. దీంతో రహదారులన్నీ దారుణంగా మారాయి. గత ఎన్నికల సమయంలో నాటి కూటిమి పార్టీలకు రహదారుల అంశమే ప్రధాన ఎన్నికల అస్త్రంగా మారింది. అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపడతామని కూటమి పార్టీలు హామీలను గుప్పించాయి. ఊహించని రీతిలో కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే పాలకులు సంక్రాంతి లోపే రహదారులను బాగుచేస్తామని ప్రకటించారు. అందుకు అనుగుణంగా వందల కోట్లను రహదారుల మరమ్మతులకు కేటాయింపులు చేశారు. అయితే కొన్ని నెలల క్రితం లక్షల


నీటితో నిండిన గోతుల్లోనే ప్రయాణిస్తున్న వాహనదారులు

రూపాయలతో ప్రత్తిపాడు-కిర్లంపూడి మధ్య రహదారికి మరమ్మతులు చేపట్టారు. అయితే సంబంధిత గుత్తేదారు రోడ్డుకు చేపట్టిన పనుల్లో నాణ్యతను పాటించకపోవడంతో ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు పలు చోట్ల భారీ గుంతలు పడ్డాయి. వర్షం వచ్చిన సమయంలో రోడ్డంతా నీటితో నిండిపోవడంతో గుంతలు కనిపించే పరిస్థితి లేదు. దీంతో ఆ గుంతల్లో పలువురు ద్విచక్రవాహనదారులు పడి గాయాలపాలౌతున్నారు. అయినా ప్రజాప్రతినిధులు, అధికారుల్లో ఏమాత్రం చలనం లేకుండా పోతుందనే అభిప్రాయాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కనీసం రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - కరప

అండర్ -17 విభాగంలో రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు కరప మండలం అరట్లకట్ట జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. జిల్లాస్థాయి ఫుట్ బాల్ పోటీలను రాజమహేంద్రవరం నిర్వహించడం జరిగిందని, ఈ పోటీలలో 9వ తరగతి విద్యార్థులు సృజన, అపర్ణ, మాలశ్రీ తమ ప్రతిభను చాటుకోవడంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 22న కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. విద్యార్థులను పిఇటి జిజెఆర్ఎస్.కౌర్, ఎస్ఎంసి ఛైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని తిప్పరాజుపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాద బాధితుడుఐన గుదే బాలకృష్ణకు పలువురు ఆర్థిక సాయాన్ని అందజేశారు. సర్పంచ్ యాల మాణిక్యాంబ భర్త ఆంజనేయవరప్రసాద్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నిత్యవసర వస్తువులు, కొంత నగదు అందజేశారు. అలాగే బంధన్‌పూడికి చెందిన దేగల నాగేంద్ర రూ.5 వేలు, కాజులూరుకు చెందిన సలాది నానాజీ రూ.2 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.


ఎంపిడిఒను అభినందిస్తున్న కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది

ఎంపిడిఒ లక్ష్మీరెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

యు,కొత్తపల్లి మండలం ఎంపిడిఒగా ఎ.లక్ష్మీరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. శంఖవరం మండలం ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒగా విధులు నిర్వర్తించిన లక్ష్మీ రెడ్డి ఉద్యోగోన్నతిపై యు.కొత్తపల్లికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మండల కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒకు అధికారులు అభినందనలు తెలిపారు.

రఫీ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు రఫీ అత్తయ్య ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో గురువరం మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ గురువారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడి రాజశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్ ఆరేళ్ల వీరరాఘవ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు


మాక్‌డ్రిల్‌లో బాలునికి వైద్యాన్ని అందిస్తున్న వైద్యులు

ఆకట్టుకున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గానికి సంబంధించి ప్రకృతి వైపరీత్యాలు, తుపానులు, వరదలు వచ్చినప్పుడు రక్షణ దళాలు ప్రజలను ఎలా కాపాడతారనే అంశాలపై ఎన్‌డిఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. స్థానిక సావిత్రి నగర్, గిరియంపేట గోదావరి నది తీరాన నిర్వహించిన మాక్ డ్రిల్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని కాపాడి, పునరావాసం కల్పించటం, నీటిలో చిక్కుకున్నవారిని కాపాడే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఇళ్లు కూలి శిథిలాల కింద చిక్కుకున్నవారిని రెస్క్యూ చేసి ఆస్పత్రికి తరలించే విధానాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. పుదుచ్చేరి డిజాస్టర్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో సుమారు 3 గంటల పాటు మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ సుకెందు దుత్త, ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, ఎన్‌డిఆర్‌ఎఫ్, రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న యూనియన్ నాయకుడు శ్రీనివాస్

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో జనాభా పురుగుదలతో చెత్త వినియోగం అధికం అయిందన్నారు. కావున అందుకు అనుగునంగా పారిశుధ్య సిబ్బందిని పెంపుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి నెల 1వ తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు అందజేయాలన్నారు. దీనిపై కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే నెలలో 20 మంది కార్మికుల్ని అదనంగా నియమిస్తామన్నారు. అందుకు సంబంధించి టెండర్లు పిలుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్, కార్మిక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వర్రే గిరిబాబు, శివకోటి అప్పారావు, సంఘ నాయకులు దొండపాటి శేఖర్, సతీష్, ముత్యాల సత్యనారాయణ, భవాని, దుర్గా భవాని, చిన్న, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక బ్రౌన్‌పేట జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాలల చట్టాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం రాయుడు విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఎంఇఒ-1 వై.శివరామకృష్ణ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు స్పష్టమైన లక్ష్యం ఉండాలని, బాలికలు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారి భవిష్యత్తు బంగారు బాటలు వేసేలా చూడాలని సూచించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండని బాలికకు వివాహం జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.